## "... ఎలుకకి ప్రాణ సంకటం"

హఠాత్తుగా మెలుకువ వచ్చింది, అతనికి. కళ్ళు తెరవటానికి ప్రయత్నించాడు. కాని కనురెప్పలు విడలేదు. ఒళ్ళంతా నొప్పిగా అనిపించింది. కాళ్ళు చేతులు కదప లేకపోయాడు. ఎక్కడ వున్నాడో అర్థంకాలేదు.

ఏవేవో మాటలు వినబడ్డాయి. కొందరి ఏడుపులు- అరుపులు- ఏదో గొడవ జరుగుతుందని గ్రహించాడు. బలవంతంగా కనురెప్పలు విప్పిచూసాడు. అప్పుడు తెలుసు కున్నాడు, రోడ్డుమీద పడివున్నట్టు. జనం పరుగెత్తుతున్నారు- ఏదో వాసన- ఎగిరే పొగ- అలుముకునే చీకటి-

అక్కడకి ఎలా వచ్చాడని ఆలోచించాడు, అతడు సుమారు నాలుగు గంటల టైంలో రోడ్డు దాటటం గుర్తుంది.

చెయ్యి రోడ్డు మీద ఆన్చి లేవటానికి ప్రయత్నించాడు, కాని కుదరలేదు. కంగారుగా చూసాడు. అప్పుడు కనబడింది, అతనికి- కుడికాలి మోకాలి క్రిందభాగం ఊడి వేలాడు తున్నట్టు. రోడ్డు మీద రక్తం నదిలా పారుతోంది. అక్కడక్కడ మానవ మాంసం ముద్దలు పడివున్న రోడ్డు సాయం సంధ్యవేళటి పశ్చిమాంబరాన్ని గుర్తుచేసింది.

"రక్షించండి, నన్ను రక్షించండి" కంగారుగా గట్టిగా అరిచాడు అతడు. "హాస్పిటల్‌కి తీసుకెళ్ళండి".

ఎదురుగా కనబడింది, హాస్పిటల్. వైద్యం కోసం ఆ హాస్పిటల్‌లోనే చేర్చాడు, రెండేళ్ళ పాపని. పాప కోసం మందులు కొని రోడ్డు దాటుతూ వుండగా వచ్చింది, ఆ శబ్దం. ఆ తరువాత...

జేబు తడిమిచూసాడు. మందులు భద్రంగానే వున్నాయి.

ముందుకు సాగటానికి ప్రయత్నించాడు. ఒళ్ళు కదలలేదు.

"నన్ను రక్షించండి. మళ్ళీ అరిచాడు. "హాస్పిటల్‌కి తీసుకెళ్ళండి".

ఎవరూ అతన్ని పట్టించుకోలేదు. కొందరైతే అతన్ని తొక్కుతూ పరిగెత్తారు.

నెత్తురు తొడుక్కున్న నిమిషాలు అతన్ని దాటి వెళ్ళాయి.

అరిచి అరిచి పూర్తిగా అలసిపోయాడు, అతడు. కళ్ళు మూతలు పడుతున్నా, ఆశగా, అటూ ఇటూ చూసాడు. మెల్లగా వచ్చి అతనివద్ద ఆగారు ఇద్దరు. అతని మెడ మీద, వీపు మీద చెయ్యివేసి లేపటానికి ప్రయత్నించాడు, ఒకడు. ఆశగా అతనివైపు చూసాడు. చమురు చుక్కలు అందిన కొడిగట్టే దీపంలా వెలిగింది అతని మోము.

"నన్ను హాస్పిటల్‌కి తీసుకెళ్ళండి" అతడు సన్నటి గొంతుతో పలికాడు.

ఆ మాటలు పట్టించుకోకుండా, ముందుకు సాగాడు రెండో అతడు.

"సీను బాగా రావాలిరా" మెడ మీద చెయ్యి వేసి తల యెత్తి పట్టుకున్న వ్యక్తి అన్నాడు. "సీను అదిరిపోవాలి".

వీడియో కెమెరా కదిలింది.

"బాస్ మెచ్చుకోవాలిరా" బాస్ మెచ్చుకుంటే... నీకు తెలుసుగా... మనకి..."

ఆ తరువాత మాటలు అతనికి వినబడలేదు. మెలుకువ రాని మైకంలోకి జారిపోయాడు అతడు.

***